# శుభోదయం!
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి : 02, సంచిక : 121, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) సోమవారం -21 - జూలై - 2025


## దేశానికి జాతీయ భాష అవసరం లేదు

**హిందీ భాషా రగడపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు**
**జైపూర్ లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్**
హిందీ జాతీయ భాష కాదని, దేశంలో అనేక అధికార భాషలున్నాయని వెల్లడి
హిందీని బలవంతంగా రుద్దుతామంటే కుదరదని స్పష్టీకరణ




హైదరాబాద్: భారతదేశానికి జాతీయ భాష అవసరం లేదని, హిందీని తమపై రుద్దకూడదని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారిన హిందీ భాషా అంశంపై ఆయన మాట్లాడారు. జైపూర్‌లో జరిగిన టాక్ జర్నలిజం 2025లో భాగంగా జరిగిన చర్చలో భాష విషయంలో గట్టి వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో కేటీఆర్, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి జాతీయ భాష గురించి అడగగా... హిందీ జాతీయ భాష కాదని, భారతదేశంలో అనేక అధికారిక భాషలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. "ఏ భాష అయినా భావవ్యక్తీకరణకు ఓ సాధనం మాత్రమే. అది ఒక సాంస్కృతిక చిహ్నం. భారత్ లో 20 అధికారిక భాషలు, 300 అనధికార భాషలు ఉన్నాయి. మిగతా..2లో

## ధన్యవాదాలు ఆనంద్ మహీంద్రా గారూ...
# మనం కలిసి పనిచేద్దాం

: మంత్రి నారా లోకేశ్

లోకేశ్, ఆనంద్ మధ్య ట్వీట్ల సంభాషణ

ఏపీలో పెట్టుబడులకు చర్చలు జరుగుతున్నాయన్న ఆనంద్ మహీంద్రా

మరింతగా విస్తరించాలంటూ లోకేశ్ ఆకాంక్ష




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా విస్తరించాలని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రాను రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఆహ్వానించారు. మహీంద్రా గ్రూప్ యొక్క ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), రక్షణ, మరియు ఏరోస్పేస్ తయారీ రంగాల్లో విస్తరణ ప్రణాళికల గురించి తెలుసుకున్నట్లు లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ట్వీట్ చేస్తూ, "ధన్యవాదాలు ఆనంద్ మహీంద్ర గారు! మనం కలిసి పనిచేద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో మీ నిరంతర పెట్టుబడులను మేము గౌరవిస్తున్నాము. ఈవీ, రక్షణ, ఏరోస్పేస్ తయారీ రంగాల్లో మీ విస్తరణకు ఏపీలో అనుకూలమైన విధానాలు, గరిష్ట ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయి. మా రాష్ట్రంలో తయారీ యూనిట్ల స్థాపనను పరిశీలిస్తే సంతోషిస్తాము. మా వేగం, విధానంతో మిమ్మల్ని ఆకట్టుకుంటామని హామీ ఇస్తున్నాము. మీ ఉద్యోగులు ఇక్కడ స్వాగతం పొందుతారు మరియు వారు కోరుకున్న భాషలో మాట్లాడవచ్చు" అని లోకేశ్ పేర్కొన్నారు. తన ట్వీట్‌లో "భిన్నత్వంలో ఏకత్వం" అనే సందేశంతో ఆంధ్రప్రదేశ్ యొక్క వైవిధ్యభరిత వాతావరణాన్ని, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను హైలైట్ చేశారు. నిన్న ఆనంద్ మహీంద్రా తమ ఫ్యూరియో-8 ట్రక్కుల తెలుగు యాడ్ ను ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ యాడ్ ను లోకేశ్ లైక్ చేశారు. అప్పటి నుంచి ఆనంద్ మహీంద్రా, లోకేశ్ మధ్య ట్వీట్ల సంభాషణ కొనసాగుతోంది.



## రాజకీయాలు మా ఇంట్లోకి రావు... ఆఫీసులో పర్సనల్ మ్యాటర్స్ రావు

- ఇండియా టుడే పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నారా లోకేశ్
- ఆసక్తికర విషయాలు పంచుకున్న మంత్రి
- ఐదేళ్ల కుటుంబ వ్యాపారంలో పనిచేసిన తర్వాతే రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి మిగతా..2లో

## ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో 8 మంది నిందితులు .. వారు ఎవరంటే ..?

**కోర్టులో ప్రిలిమినరీ చార్జ్ షీటు దాఖలు చేసిన సిట్**


మిగతా..2లో

నిందితుల జాబితాలో ముడుపుల వసూళ్ల నెట్ వర్క్ పాత్రదారులు

చార్జ్ షీటులో వారి పాత్ర వివరాలు వెల్లడించిన సిట్

## నేను డీకే పేరు చెప్పాలా?, మీరు నాకు సూచిస్తారా?
## సీఎం సిద్ధరామయ్య అసహనం


2లో

కర్ణాటక సీఎం మార్పు అంశంపై గత కొన్ని రోజులుగా జోరుగా చర్చ

సీఎం సిద్ధరామయ్యను మార్చే అవకాశం ఉందని, ఆ స్థానంలో డీకే శివకుమార్‌కు అవకాశం కల్పించడానికి రంగం సిద్ధమైందంటూ మీడియాలో ప్రచారం



2లో

## అంబటి రాంబాబుకు పోలీసుల నోటీసులు

- అంబటికి నోటీసులు ఇచ్చిన సత్తెనపల్లి గ్రామీణ పోలీసులు
- జగన్ రెంటపాళ్ల పర్యటన సమయంలో నిబంధనలు ఉల్లంఘించారని అంబటిపై కేసు

## జులై 23 నుంచి 26 వరకు మోదీ విదేశీ పర్యటన


2లో

బ్రిటన్, మాల్దీవుల్లో నాలుగు రోజుల అధికారిక పర్యటన

బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఆహ్వానం మేరకు మోదీ జులై 23-24 తేదీల్లో యూకేకు

అంతర్జాతీయ మరియు ప్రాంతీయ అంశాలపై కూడా ఇరు దేశాల నాయకులు చర్చ


2లో

మెగా డ్యామ్ నిర్మాణాన్ని ప్రారంభించిన
## డ్రాగన్ కంట్రీ.. భారత్ ఆందోళన

టిబెట్, భారత్ మీదుగా ప్రవహించే బ్రహ్మపుత్ర నదిపై ఈ మెగా డ్యామ్ నిర్మాణం

టిబెట్‌లోని యార్లుంగ్ త్సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై ఈ ప్రాజెక్టును బీజింగ్ డిసెంబరులో ఆమోదించింది

దేశ ప్రయోజనాలను కాపాడుకోవడానికి పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటాం




## బోనమెత్తిన హైదరాబాద్.. సందడే సందడి





## హైదరాబాద్‌లో బోనాల సందడి



హైదరాబాద్: నగర వ్యాప్తంగా బోనాల జాతర సందడి మొదలైంది. అమ్మవారి ఆలయాలకు ఉదయం నుంచే భక్తులు బోనాలతో బారులు తీరారు. చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. లాల్‌దర్వాజా సింహవాహిని మహాకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

హైదరాబాద్: నగరంతో పాటు పాతబస్తీలో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు బలిహరణ,




## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన దుల్కర్ సల్మాన్

జూబ్లీహిల్స్ లోని రేవంత్ నివాసంలో మర్యాదపూర్వక భేటీ


2లో

దుల్కర్ వెంట నిర్మాతలు స్వప్న దత్, చెరుకూరి సుధాకర్

దుల్కర్ కు శాలువా కప్పిన రేవంత్ రెడ్డి




## రాహుల్ సిప్లిగంజ్ కు సీఎం రేవంత్ రూ. కోటి బహుమతి

- చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు అందజేత
- రాహుల్ కు ప్రత్యేక అవార్డును ప్రకటించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆదేశం




## జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు సమావేశాలు
## మొత్తం 21 సెషన్ల పాటు సమావేశాలు
## పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టనున్న ఎన్డీయే సర్కారు

ఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 21 (సోమవారం) నుంచి ఆగస్టు 21 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎనిమిది కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. మొత్తం 21 సెషన్లు జరగనుండగా, ఆగస్టు 12 నుంచి 18 వరకు రక్షాబంధన్ మరియు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విరామం ఉంటుంది. ఈ వర్షాకాల సమావేశాల్లో... ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బిల్లుల్లో జాతీయ క్రీడా పాలన బిల్లు, భూ-సంపద స్థలాలు, భూపరిరక్షణ మరియు నిర్వహణ బిల్లు, గనులు మరియు ఖనిజాల (అభివృద్ధి మరియు నియంత్రణ) మిగతా..2లో




## ఏపీ లిక్కర్ స్కాం: మిథున్ రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్

- ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం
- మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసిన సిట్
- కోర్టులో హాజరు మిగతా..2లో

శుభోదయం!
WWW.SUBHODAYAMDAILY.COM
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!


## జులై 23 నుంచి 26 వరకు
# మోదీ విదేశీ పర్యటన

ఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జులై 23 నుంచి 26 వరకు బ్రిటన్, మాల్దీవుల్లో నాలుగు రోజుల అధికారిక పర్యటనకు వెళ్ళనున్నారు. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, వాణిజ్యం, భద్రత మరియు ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా కొనసాగనుంది. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఆహ్వానం మేరకు మోదీ జులై 23-24 తేదీల్లో యూకేను సందర్శిస్తారు. మోదీ యూకేలో పర్యటించడం ఇది నాలుగోసారి. ఈ సందర్శనలో భారత్-యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, ఆర్థికం, సాంకేతికత, ఆవిష్కరణలు, రక్షణ, భద్రత, వాతావరణం, ఆరోగ్యం, విద్య మరియు ప్రజల మధ్య సంబంధాలపై చర్చలు జరుగనున్నాయి. అంతర్జాతీయ మరియు ప్రాంతీయ అంశాలపై కూడా ఇరు దేశాల నాయకులు చర్చించనున్నారు. ఈ సందర్శనలో భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పై కూడా కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. జులై 25-26 తేదీల్లో మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశాన్ని సందర్శిస్తారు. మోదీ మాల్దీవుల్లో పర్యటించడం ఇది మూడోసారి. అంతేకాదు, ముయిజ్జు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఏ దేశాధినేత లేదా ఏ దేశ ప్రధాని మాల్దీవుల్లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో మోదీ, మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'గౌరవ అతిథి'గా పాల్గొననున్నారు. 2024 అక్టోబరులో ముయిజ్జు భారత్ పర్యటనలో ఆమోదించిన 'భారత్-మాల్దీవ్స్ సమగ్ర ఆర్థిక మరియు సముద్ర భద్రతా భాగస్వామ్యం' అమలు పురోగతిని ఇరు నాయకులు సమీక్షించనున్నారు. ఈ సందర్శన భారత్ 'నైబర్‌హుడ్ ఫస్ట్' (పొరుగు దేశానికి మొదటి ప్రాధాన్యత) విధానం మరియు 'విజన్ మహాసాగర్' కింద మాల్దీవులతో సంబంధాలను బలోపేతం చేయడానికి ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.

## మెగా డ్యామ్ నిర్మాణాన్ని ప్రారంభించిన
# డ్రాగన్ కంట్రీ.. భారత్ ఆందోళన

ఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన జల విద్యుత్ ప్రాజెక్టును డ్రాగన్ కంట్రీ చైనా ప్రారంభించింది. టిబెట్, భారత్ మీదుగా ప్రవహించే బ్రహ్మపుత్ర నదిపై ఈ మెగా డ్యామ్ నిర్మాణం చేపట్టనుంది. ఈ నిర్మాణ పనులు శనివారం ప్రారంభించింది. ఈ ప్రారంభపనులకు చైనా ప్రధాని లి కియాంగ్ హాజరయ్యారని చైనా మీడియా వెల్లడించింది. టిబెట్‌లోని యార్లుంగ్ త్సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై ఈ ప్రాజెక్టును బీజింగ్ డిసెంబరులో ఆమోదించింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ ప్రధానంగా వినియోగం కోసం ఇతర ప్రాంతాలకు ప్రసారం చేయడం జరుగుతుంది. అదే సమయంలో టిబెట్‌లోని స్థానిక విద్యుత్ అవసరాలను కూడా తీరుస్తుందని అని ఆగ్నేయ టిబెట్‌లోని నైంగ్చిలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమం తర్వాత వార్తా సంస్థ జిన్హువా నివేదించింది. ఇదిలావుంటే ఈ ప్రాజెక్టుపై భారత్, బంగ్లాదేశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న డ్రాగన్ కంట్రీ మాత్రం మొండిగా ముందకు వెళ్లడం గమనార్హం. ఎందుకంటే ఇది ఇరు దేశాల్లోని దిగువన ఉన్న లక్షలాది మంది ప్రజలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. టిబెట్‌లోని ఈ ప్రాజెక్టు గురించి జనవరిలో చైనాతో ఆందోళన వ్యక్తం చేశామని భారత్ తెలిపింది. దేశ ప్రయోజనాలను కాపాడుకోవడానికి పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. బ్రహ్మపుత్ర నది దిగువ ప్రాంతాలో జరిగే కార్యకలాపాల వల్ల దాని దిగువ ప్రాంతాల ప్రయోజనాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాను కోరడం జరిగింది అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన దుల్కర్ సల్మాన్

హైదరాబాద్: మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, నిర్మాతలు స్వప్న దత్, చెరుకూరి సుధాకర్ ఆదివారం (జులై 20) నాడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దుల్కర్ సల్మాన్‌ను శాలువా కప్పి సత్కరించారు. అనంతరం కాసేపు ముచ్చటించుకున్నారు. దుల్కర్ సల్మాన్ తెలుగు చిత్ర పరిశ్రమలో 'మహానటి', 'సీతారామం', 'లక్కీ భాస్కర్' వంటి స్ట్రయిట్ చిత్రాలతో గుర్తింపు పొందారు. ఇందులో మహానటి, సీతారామం స్వప్న దత్ నిర్మాతగా వైజయంతీ మూవీస్ బ్యానర్ పైనే వచ్చాయి. ప్రస్తుతం దుల్కర్ 'కాంత', ఆకాశంలో ఒక తార అనే చిత్రాల్లో నటిస్తున్నారు. కాంత చిత్రాన్ని రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా సంస్థ నిర్మిస్తోంది.

## రాహుల్ సిప్లిగంజ్ కు సీఎం రేవంత్ రూ. కోటి బహుమతి

హైదరాబాద్: తెలంగాణ బోనాల పండుగ వేళ హైదరాబాదీ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు ప్రభుత్వం రూ. కోటి నజరానా ప్రకటించింది. దీనికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు అందించారు. రాష్ట్ర యువతకు రాహుల్ సిప్లిగంజ్ ఆదర్శనీయమని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి కొనియాడారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నటీనటులకు గద్దర్ ఫిలిం అవార్డ్స్ అందించిన విషయం తెలిసిందే. ఈ వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రాహుల్ సిప్లిగంజ్ పేరును ప్రస్తావించారు. రాహుల్ కు ప్రత్యేక అవార్డును ప్రకటించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే బోనాల పండుగ సందర్భంగా రాహుల్ సిప్లిగంజ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రూ. కోటి నగదు పురస్కారం అందజేశారు. సొంత కృషితో ఎదిగిన రాహుల్ సిప్లిగంజ్.. ఆర్ఆర్ఆర్ సినిమా కోసం పాడిన 'నాటు నాటు' సాంగ్ ఆస్కార్ అవార్డును గెలుచుకున్న విషయం తెలిసిందే. మార్చి 2023 లో జరిగిన 95వ అకాడమీ అవార్డుల వేడుకలో ఈ పాటను ప్రదర్శించారు.

## ఏపీ లిక్కర్ స్కాం: మిథున్ రెడ్డికి
# ఆగస్టు 1 వరకు రిమాండ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు శనివారం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన ఏ4 నిందితుడిగా ఉన్నారు. దాదాపు 7 గంటల విచారణ అనంతరం శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో విజయవాడలోని సిట్ కార్యాలయంలో మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఆయనను విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు మిథున్‌రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్ విధించింది. కోర్టులో మిథున్ రెడ్డి తరఫున న్యాయవాది నాగార్జునరెడ్డి వాదనలు వినిపించగా, సిట్ తరఫున కోటేశ్వరరావు వాదనలు వినిపించారు. తాము కస్టడీకి కోరుతున్నందున మిథున్ రెడ్డిని గుంటూరు సబ్ జైలుకు రిమాండ్ కు పంపాలని సిట్ కోరగా, మిథున్ రెడ్డి ఓ ఎంపీ అని, ఆయనకు వై కేటగిరీ భద్రత ఉందని, ఆయనకు నెల్లూరు జిల్లా జైలులో ప్రత్యేక బ్యారక్ కేటాయించాలని న్యాయవాది నాగార్జునరెడ్డి కోరారు. పైగా మిథున్ రెడ్డి పార్లమెంటులో ప్యానెల్ స్పీకర్ గా చేశారని, ఆయన అరెస్ట్ పై లోక్ సభ స్పీకర్ కు సమాచారం ఇవ్వాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం ఆగస్టు 1 వరకు రిమాండ్ విధించింది. మద్యం కుంభకోణం కేసులో మిథున్‌రెడ్డి ప్రధాన కుట్రదారుల్లో ఒకరని, లిక్కర్ పాలసీ రూపకల్పన, డొల్ల కంపెనీలకు ముడుపుల సరఫరా వంటి అంశాల్లో కీలక పాత్ర పోషించారని సిట్ ఆరోపిస్తోంది. ఈ కేసులో ఇప్పటివరకు 12 మందిని అరెస్ట్ చేసిన సిట్, మిథున్‌రెడ్డితో సహా మొత్తం 40 మంది ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. ఈ కుంభకోణం వల్ల రాష్ట్ర ఖజానాకు సుమారు 3,200 కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు అంచనా. మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై వైసీపీ నాయకులు తీవ్రంగా స్పందిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఈ కేసును సృష్టించారని, వైసీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అయితే, సిట్ మాత్రం ఈ కేసులో గట్టి ఆధారాలు సేకరించినట్లు పేర్కొంది.

## రాజకీయాలు మా ఇంట్లోకి రావు...
# ఆఫీసులో పర్సనల్ మ్యాటర్స్ రావు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ 'ఇండియా టుడే' పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర అంశాలు పంచుకున్నారు., ఇంట్లో, ఆఫీస్‌లో తన తండ్రి చంద్రబాబును ఎలా పిలుస్తారనే విషయంపై స్పందించారు. "కింద ఫ్లోర్‌లో ఉంటే ఆయన నా బాస్. పై ఫ్లోర్‌లో ఉంటే ఆయన నా నాన్న. రాజకీయాలు ఇంట్లోకి రావు, ఆఫీస్‌లోకి పర్సనల్ మేటర్స్ రావు. అవి మేము గీసుకున్న కచ్చితమైన హద్దులు. ఇంట్లో ఉన్నప్పుడు ఆయనను నాన్నా అని పిలుస్తాను. తన కెరీర్ లో తల్లి నారా భువనేశ్వరి పాత్రను కూడా ప్రస్తావించారు. "మా అమ్మ నా పట్ల చాలా బాధ్యతాయుతంగా వ్యవహరించింది. నా ఎదుగుదల కోసం అన్ని రకాలుగా త్యాగం చేసింది. నా చదువు, కెరీర్ మరియు ఇతర అంశాల్లో నాకు మార్గదర్శనం చేసింది'' అని వివరించారు. ఇక తమ కుటుంబ వ్యాపారంలో ఐదు సంవత్సరాలు పనిచేసిన తర్వాతే తాను రాజకీయాల్లోకి వచ్చానని లోకేశ్ చెప్పారు. అప్పటినుంచి ఫుల్ టైమ్ రాజకీయవేత్తగా కొనసాగుతున్నానని తెలిపారు.

## హైదరాబాద్‌లో నకిలీ కాల్ సెంటర్ ముఠా గుట్టురట్టు



హైదరాబాద్: నకిలీ కాల్ సెంటర్ ద్వారా సామాన్య ప్రజలను మోసం చేస్తున్న ముఠా సభ్యులను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన కొందరు వ్యక్తులు నగరంలోని బాచుపల్లిలో ఒక విల్లాను అద్దెకు తీసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, ఆకస్మిక దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వివిధ క్రెడిట్ కార్డుల కంపెనీలకు అనుబంధంగా ఉండే ప్రముఖ చెల్లింపు వేదికలు (ప్లాట్‌ఫారమ్‌లు), ఆర్థిక సంస్థల ప్రతినిధులుగా నటిస్తూ నిందితులు మోసాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను డానిష్ ఆలం, ఎండీ సాహెబ్ ఆలీ అలియాస్ సోను, ఎండీ ఫహద్ పర్వేజ్, ఎండీ అమన్ ఆలం, ఎండీ ఇష్టియాక్ అహ్మద్, మహ్మద్ మొహసిన్, ఫరీద్ హుస్సేన్, ఎండీ షాదాబ్ ఆలం, ఎండీ సోనుగా పోలీసులు గుర్తించారు. మరికొంత మంది నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 22 మొబైల్ ఫోన్లు, పది ల్యాప్‌టాప్‌లు, హెడ్‌సెట్‌లు, కాల్ సెటప్ పరికరాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు వెల్లడించారు.

# బోనమెత్తిన హైదరాబాద్.. సందడే సందడి

మొదటి పేజి తరువాయి

అమ్మవారి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు బలిహరణ, అనంతరం ఉదయం మాజీ ఎంపీ దేవేందర్ గౌడ్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా మహాభిషేకం జరిగింది. తదనంతరం బోనాల సమర్పణ కార్యక్రమం ప్రారంభమైంది. బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పట్టు వస్త్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ సంస్కృతిలో అనాదిగా కొనసాగుతూ వస్తున్నాయన్నారు. గోల్కొండలో మొదలైన ఉత్సవాలు, సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల వరకు జరుగుతున్నాయి. బోనాలు ప్రశాంతంగా అత్యంత భక్తి భావంతో కొనసాగుతున్నాయి. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి రాష్ట్ర ప్రజలను చల్లగా చూడమని వేడుకున్నాను. దాదాపు రూ.1290 కోట్లతో దేవాదాయ శాఖకు నిధులు విడుదల చేశాం. రూ.20 కోట్లు హైదరాబాద్‌లో బోనాల కోసం నిధులు విడుదల చేశాం. మహంకాళి అమ్మవారి ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తామని భట్టి విక్రమర్క తెలిపారు. కాగా, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆలయాల పరిసరాల్లో బాంబు, డాగ్ స్క్వాడ్, నిఘా వర్గాలు భారీగా మోహరించాయి.



దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, అదనపు డీసీపీ మజీద్, ఛత్రినాక ఏసీపీ సి.హెచ్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.ప్రసాద్ వర్మ లు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

## ఘనంగా ప్రారంభమైన లాల్‌దర్వాజా మహాకాళి బోనాలు

నగరంలోని లాల్‌దర్వాజా సింహవాహిని మహాకాళి అమ్మవారి బోనాల జాతర ఘనంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి కుమ్మరి బోనం సమర్పించారు. ఆలయం వద్ద నాలుగు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. బోనాలు తెచ్చేవారి కోసం ప్రత్యేక క్యూలైన్ అందుబాటులో ఉంచారు. 1200 మంది పోలీసులు, 10 షీ టీమ్స్‌తో ఆలయం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా 2 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. అమ్మవారిని మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు దర్శించుకున్నారు. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత ఆలయానికి వచ్చారు. హైదరాబాద్ నగరంలో బోనాల పండగ ప్రశాంతంగా జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం తరఫున లాల్‌దర్వాజా సింహవాహిని మహాకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి రూ.1,290 కోట్లు కేటాయించామన్నారు. బోనాలకు ప్రత్యేకంగా రూ.20 కోట్లు కేటాయించినట్లు వివరించారు.



# నేటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు



ఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 21 (సోమవారం) నుంచి ఆగస్టు 21 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎనిమిది కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. మొత్తం 21 సెషన్లు జరగనుండగా, ఆగస్టు 12 నుంచి 18 వరకు రక్షాబంధన్ మరియు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విరామం ఉంటుంది. ఈ వర్షాకాల సమావేశాల్లో... ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బిల్లుల్లో జాతీయ క్రీడా పాలన బిల్లు, భూ-సంపద స్థలాలు, భూపరిరక్షణ మరియు నిర్వహణ బిల్లు, గనులు మరియు ఖనిజాల (అభివృద్ధి మరియు నియంత్రణ) సవరణ బిల్లు, జాతీయ యాంటీ-డోపింగ్ (సవరణ) బిల్లు, మణిపూర్ వస్తు సేవల పన్ను (సవరణ) బిల్లు, జన్ విశ్వాస్ (సవరణ) బిల్లు, భారతీయ నిర్వహణ సంస్థల (సవరణ) బిల్లు, మరియు పన్ను చట్టాల (సవరణ) బిల్లు ఉన్నాయి. అలాగే, ఆదాయపు పన్ను బిల్లు 2025ని కూడా ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లును ఫిబ్రవరిలో సెలెక్ట్ కమిటీకి పంపించారు. బుధవారం ఈ కమిటీ తన నివేదికను స్వీకరించింది. దీనిని సోమవారం లోక్‌సభలో దీనిని సమర్పించే అవకాశం ఉంది. ఇంకా, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించడానికి మరియు రాష్ట్ర డిమాండ్ ఫర్ గ్రాంట్స్‌ను ఆమోదించడానికి పార్లమెంట్ అనుమతిని కోరనుంది. గోవా రాష్ట్ర శాసనసభ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య సర్దుబాటు బిల్లు 2024, వ్యాపార నౌకాయాన బిల్లు 2024, మరియు భారతీయ ఓడరేవుల బిల్లు 2025 వంటి బిల్లులు కూడా లోక్‌సభలో ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమావేశాల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరియు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బ్లాక్‌తో సహా ప్రతిపక్షాల మధ్య వాడీవేడిగా సాగనుంది. బీహార్‌లో ఎన్నికల జాబితాల వివాదం, పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ విరమణకు మధ్యవర్తిత్వం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలు ఈ సమావేశాల్లో చర్చనీయాంశాలుగా ఉండనున్నాయి.

## నేను డీకే పేరు చెప్పాలా?, మీరు నాకు సూచిస్తారా?
## సీఎం సిద్ధరామయ్య అసహనం



కర్ణాటక: కర్ణాటక సీఎం మార్పు అంశంపై గత కొన్ని రోజులుగా జోరుగా చర్చ నడుస్తోంది. సీఎం సిద్ధరామయ్యను మార్చే అవకాశం ఉందని, ఆ స్థానంలో డీకే శివకుమార్‌కు అవకాశం కల్పించడానికి రంగం సిద్ధమైందంటూ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. అయితే దీనిపై సిద్ధరామయ్య కానీ, డీకే శివ కుమార్ కానీ ఇప్పటివరకూ ఎటువంటి ప్రకటన చేయలేదు. అయితే (శనివారం, జూలై 19వ తేదీన) మైసూర్ జిల్లాలో జరిగిన పార్టీ ఈవెంట్‌లో ప్రభుత్వంలో నెలకొన్న అసంతృప్తిని సీఎం సిద్ధరామయ్య బహిరంగంగానే వెళ్లగక్కారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ పేరును పేర్కొనాలనే సూచనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలను కీర్తించే క్రమంలో కొత్త ప్రాజెక్టులను ప్రకటించడంలో భాగంగా ఏర్పాటు చేసిన 'సాధన సమావేశం'లో సీఎం సిద్ధరామయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా హాజరయ్యారు,. అయితే అత్యవసరంగా ఆయన బెంగళూరు బయల్దేరాల్సి ఉండటంతో వేదిక పైనుంచి ఉన్నపళంగా వెళ్లిపోయారు. అయితే సిద్ధరామయ్య ప్రసంగానికి సిద్ధమైన క్రమంలో పార్టీ ముఖ్యులను పరిచయం చేసే క్రమంలో డీకే పేరు ప్రస్తావించలేదు. అయితే డీకే, డీకే, డీకే అంటూ సభకు వచ్చిన జనం నుంచి స్పందన వచ్చింది. దీనిపై సిద్ధరామయ్యలో కోపం కట్టలు తెంచుకుంది. అదే సమయంలో డీకే పేరును మరిచిపోయారనే ఉద్దేశంతో కాంగ్రెస్‌కు చెందిన ఒక న్యాయవాది.. ఆ విషయాన్ని ఆయనకు తెలియజేసే ప్రయత్నం చేశారు. దీంతో సిద్ధరామయ్యకు కోపం మరింత ఎక్కువవైంది. ' డీకే శివకుమార్ ఇక్కడ లేరు.. అవునా.. కాదా.. దయచేసి మీరు వెళ్లి కూర్చోండి. మీరు ఏ తరహా న్యాయవాది' అంటూ కాస్త స్వరం పెంచి మరీ సిద్ధరామయ్య అనడంతో ఇది పార్టీలోని, ప్రభుత్వంలో అంతర్గత లుకలుకల్ని బయటపెట్టింది.

## అంబటి రాంబాబుకు పోలీసుల నోటీసులు

అమరావతి: వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బిగ్ షాక్ తగిలింది. సత్తెనపల్లి గ్రామీణ పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ గత నెల 18న పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సమయంలో అంబటి రాంబాబు నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే ఈ నెల 21న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో తెలిపారు. ఇక, గతంలో కూడా సత్తెనపల్లి పట్టణ పీఎస్‌లో అంబటిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా సత్తెనపల్లి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు ఫైల్ అయింది. ఈ కేసులో మాజీ మంత్రి విడదల రజనీతో పాటు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతో సహా జిల్లా నేతలు ఉన్నారు. ఇలా మొత్తం 118 మందిపై పోలీసులు కేసులు నమోదు చేయగా.. ఇప్పటికే పలువురిని విచారించారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో 8 మంది నిందితులు .. వారు ఎవరంటే ..?
### కోర్టులో ప్రిలిమినరీ చార్జ్ షీటు దాఖలు చేసిన సిట్




అమరావతి: ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో సిట్ అధికారులు మరో 8 మందిని నిందితులుగా చేర్చారు. ఈ విషయాన్ని ప్రాథమిక అభియోగ పత్రం (ప్రిలిమినరీ చార్జ్ షీట్)లో సిట్ పేర్కొంది. నిన్న శనివారం కోర్టులో సిట్ ప్రిలిమినరీ చార్జ్ షీటు దాఖలు చేసింది. తాజాగా నిందితులుగా చేర్చిన వారిలో ఎక్కువ మంది లిక్కర్ ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్‌లో పాత్రధారులు. ముడుపుల సొమ్ము భద్రపరిచిన డెన్లలోని సొత్తు హ్యాండ్లర్లు. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, మరో నిందితుడు ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిల ప్రతినిధులుగా వీరు ఈ స్కామ్‌లో కీలకంగా పని చేశారు. వీరిలో కొంత మంది ఇప్పటికే విదేశాలకు పారిపోయారు. వీరిలో పలువురు దుబాయ్‌లో, ఒకరిద్దరు అమెరికాలో ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ స్కామ్‌లో వీరి పాత్ర, ప్రమేయం గురించి చార్జ్ షీటులో సిట్ ప్రస్తావించింది. తాజా నిందితుల్లో రాజ్ కెసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాశ్ రెడ్డి సోదరుడు ముప్పిడి అనిరుథ్ రెడ్డి, ఆదాన్ డిస్టిలరీస్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ బొల్లారం శివకుమార్, సైమన్ ప్రసన్, రాజీవ్ ప్రతాప్, కొమ్మారెడ్డి అవినాశ్ రెడ్డి, సైమన్ ప్రసన్ బావమరిది మోహన్ కుమార్, ముప్పిడి అనిరుథ్ రెడ్డి బావమరిది అనిల్ కుమార్ రెడ్డి, ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి స్నేహితుడు, ఐఐటీ పూర్వ విద్యార్థి సుజల్ బెహరూన్ లు ఉన్నారు. వీరంతా లిక్కర్ ముడుపుల సొమ్ము వసూళ్లు, తరలింపు, డొల్ల కంపెనీల ద్వారా మళ్లింపులో కీలకంగా వ్యవహరించినట్లు సిట్ పేర్కొంది.

## దేశానికి జాతీయ భాష
# అవసరం లేదు

మొదటి పేజి తరువాయి

భారత్ లో 20 అధికారిక భాషలు, 300 అనధికార భాషలు ఉన్నాయి. హిందీ మాట్లాడేవారు ఎక్కువ ఉన్నారని హిందీ భాషను మా మీద రుద్దుతామంటే కుదరదు. తెలుగు భాషను జాతీయ భాషగా చేయాలని ప్రతిపాదిస్తే మిగతా ప్రాంతాల వారు ఒప్పుకుంటారా? 70-80 ఏళ్ళు దేశం బాగుంటే, మళ్లీ జాతీయ భాష ఎందుకు?" అని ప్రశ్నించారు. హిందీ భాషకు బడ్జెట్‌లో రూ. 50 కోట్లు కేటాయించి, తెలుగు, బెంగాలీ భాషలకు ఎందుకు నిధులు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల ప్రజలపై తెలుగును రుద్దనప్పుడు హిందీని తమపై ఎందుకు రుద్దుతున్నారని ఆయన నిలదీశారు. దేశంలో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ అయినప్పటికీ, హిందీ నేర్చుకోవాలా వద్దా అనేది ప్రజలకే వదిలేయాలని, దానిని వారిపై బలవంతంగా రుద్దకూడదని ఆయన అన్నారు.

## పహల్గామ్ ఉగ్రదాడి.. ట్రంప్ వ్యాఖ్యలు..
## బీహార్ ఓటర్ లిస్ట్.. ఇండియా కూటమి వ్యూహం ఇదే!



ఢిల్లీ: 24 ప్రతిపక్ష పార్టీలతో కూడిన ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు అవసరమైన అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటోంది. రేపటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానుండగా పహల్గామ్ ఉగ్రదాడికి న్యాయం జరగకపోవడం, భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలు, బీహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) వంటి అంశాలను లేవనెత్తనుంది. ఇండియా కూటమి నేతలు నిన్న వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మొత్తం 8 అంశాలను ప్రస్తావించారు. వీటిలో భారత విదేశాంగ విధానంలో వైఫల్యాలు, గాజా సంక్షోభం, డీలిమిటేషన్, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, మైనార్టీలపై దౌర్జన్యాలు పెరగడం తదితర అంశాలున్నాయి. సమావేశం అనంతరం కాంగ్రెస్ నేత, రాజ్యసభలో ఉపనేత ప్రమోద్ తివారీ మీడియాతో మాట్లాడారు. వర్షాకాల సమావేశాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవుతారని, తాము లేవనెత్తే కీలక అంశాలపై ఆయన నేరుగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. 'విదేశీ పర్యటనల కంటే పార్లమెంట్ చాలా ముఖ్యం' అని మోదీని ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరించడం ప్రతిపక్షాలకు అత్యంత ప్రాధాన్యమని చెప్పారు. ఇండియా కూటమి నేతలు ఆగస్టులో వ్యక్తిగతంగా సమావేశం కానున్నట్టు ప్రకటించారు.

## భారీ వ్యయంతో టిబెట్‌లోని బ్రహ్మపుత్ర
# నదిపై చైనా 'మెగా డ్యామ్' నిర్మాణం

ఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని డ్రాగన్ కంట్రీ చైనా శనివారం ప్రారంభించింది. టిబెట్, భారత్ గుండా ప్రవహించే బ్రహ్మపుత్ర నదిపై చైనా ఈ మెగా-ఆనకట్ట నిర్మాణాన్ని మొదలుపెట్టింది. ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి చైనా ప్రధాని లి కియాంగ్ హాజరయ్యారని అక్కడి మీడియా తెలిపింది. టిబెట్‌లోని యార్లుంగ్ త్సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై ఈ ప్రాజెక్టును బీజింగ్ డిసెంబర్‌లో ఆమోదించింది. "ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తు ప్రధానంగా వినియోగం కోసం ఇతర ప్రాంతాలకు ప్రసారం చేయడం జరుగుతుంది. అదే సమయంలో టిబెట్‌లోని స్థానిక విద్యుత్ అవసరాలను కూడా తీరుస్తుంది" అని ఆగ్నేయ టిబెట్‌లోని నైంగ్చిలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమం తర్వాత వార్తా సంస్థ జిన్హువా నివేదించింది. కాగా, ఈ ప్రాజెక్టు నిర్మాణంపై భారత్, బంగ్లాదేశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న డ్రాగన్ కంట్రీ మాత్రం మొండిగా ముందుకు వెళ్లడం గమనార్హం. ఎందుకంటే ఇది ఇరు దేశాల్లోని దిగువన ఉన్న లక్షలాది మంది ప్రజలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. టిబెట్‌లోని ఈ ప్రాజెక్టు గురించి జనవరిలో చైనాతో ఆందోళన వ్యక్తం చేశామని భారత్ తెలిపింది. దేశ ప్రయోజనాలను కాపాడుకోవడానికి పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. "బ్రహ్మపుత్ర నది దిగువ ప్రాంతాలలో జరిగే కార్యకలాపాల వల్ల దాని దిగువ ప్రాంతాల ప్రయోజనాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాను కోరడం జరిగింది" అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. పర్యావరణపరంగా సున్నితమైన టిబెటన్ పీఠభూమిలో ఇటువంటి మెగా ప్రాజెక్టుల కోలుకోలేని ప్రభావం గురించి దిగువ ప్రాంతాల ఆందోళనలతో పాటు, పర్యావరణవేత్తలు కూడా హెచ్చరించారు. ఇక, ఈ ప్రాజెక్టులో భాగంగా చైనా ఐదు జలవిద్యుత్ కేంద్రాలను నిర్మించాల్సి ఉంటుందని, మొత్తం పెట్టుబడి దాదాపు 1.2 ట్రిలియన్ యువాన్లు (సుమారు రూ.14లక్షల కోట్లు) ఉంటుందని జిన్హువా తెలిపింది.

# మిథున్ రెడ్డి అరెస్ట్ అమానుషం

## అరెస్టులతో వైసిపిని భయపెట్టలేరు : వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు నైరుతి రెడ్డి



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 21(శుభోదయం న్యూస్): మిథున్ రెడ్డి అరెస్ట్ అమానుషమని వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి తీవ్రస్థాయిలో కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్ర వ్యక్తం చేశారు ఆదివారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నదని తీవ్ర స్థాయిలో విమర్శించారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ నాయకులు కార్యకర్తలపై దాడులు ఎక్కువైపోయాయి అరెస్టులతో వైసిపి భయపెట్టలేరు అన్నారు ఇప్పటికే ప్రజలు బూటకు వాగ్దానాలకు తాము బలైపోయామని ఆవేదన వ్యక్తం చేయడం రాష్ట్ర వ్యాప్తంగా ఎవరిని అడిగిన చెబుతారన్నారు సూపర్ సిక్స్ పథకం అట్టర్ ఫ్లాప్ అయిందని ఆమె అన్నారు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అభివృద్ధి వైపు దృష్టి పెట్టకుండా వైసిపి నాయకుల పై దొంగ కేసులు పెట్టి అరెస్టు చేయడం భావ్యం కాదన్నారు ఇప్పటికైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు రాబోయే సం సంస్థాగత ఎన్నికల్లో వైసీపీ విజయ డంకా మోగించడం ఖాయమన్నారు.

## మిథున్ రెడ్డి అరెస్ట్ పై అంబేద్కర్ విగ్రహ వద్ద నిరసన తెలిపిన వైసిపి యువజన విద్యార్థి విభాగం




గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జులై 21 (శుభోదయం న్యూస్): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ని కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ కావాలనే కక్ష సాధింపు ధోర ణితో నిన్నటి రోజున అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేయకపోగా కేవలం ప్రశ్నిస్తున్నారనేటువంటి నేపముతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన కార్యకర్తల పైన అక్రమ అరెస్టులు చేస్తూ దాడులు చేస్తూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించినటువంటి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి నారా లోకేష్ ప్రవేశపెట్టినటువంటి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు అన్నారు.వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు సంక్షేమ కార్యక్రమాలు తప్ప ఇలా కక్ష సాధింపు దూరంలో చేయలేదన్నారు. కూటమి నాయకులు అధికారులను అడ్డం పెట్టుకొని తప్పుడు ఆరోపణలు చేస్తూ.జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్నటువంటి నాయకులను టార్గెట్ చేస్తూ ఎలాంటి ఆధారాలు లేకున్నప్పటికీ కావాలనే వారిపైన అక్రమ అరెస్టులు చేయటం నియంతృత్వానికి పరాకాష్ట అన్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో చేపట్టిన తర్వాత మద్యపానాన్ని నియంత్రిస్తూ ఒక పద్ధతిలో ప్రభుత్వమే మద్యం నడిపే విధంగా ఆన్లైన్ పద్ధతిలో ప్రభుత్వానికి లాభం వచ్చే విధంగా చేశారన్నారు ప్రభుత్వమే మద్యం నడిపినప్పుడు అవినీతి ఏ విధంగా జరుగుతుందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మద్యపానాన్ని ఇష్టానుసారంగా నియంత్రణలు లేకుండా పాఠశాలల వద్ద దేవస్థానాలు వద్ద ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిత్యం మద్యం దొరికే విధంగా మద్యపాన రాష్ట్రంగా కూటమి ప్రభుత్వం చేసిందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2019 నుంచి 2024 సంవత్సరంలో ఒక్కటంటే ఒక్కటి నూతనంగా మద్యం కంపెనీలకు పర్మిషన్లు ఇవ్వలేదన్నారు.

## పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేతుల మీదుగా త్రినేత్రా ఆసుపత్రి మెగా వైద్య శిబిరం ప్రారంభం





జంగారెడ్డిగూడెం- డివిజన్ ఇంచార్జ్- జూలై 20 (శుభోదయం న్యూస్): బుట్టాయగూడెం మండలంలోని దొరమామిడి గ్రామంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గారు అధికారికంగా ప్రారంభించారు. జంగారెడ్డిగూడెం త్రినేత్రా ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు వైద్య సేవలు పొందేందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే సంకల్పంతో త్రినేత్రా ఆసుపత్రి చేపట్టిన ఈ మెగా వైద్య శిబిరం నిజమైన సేవా దృక్పథానికి ప్రతిరూపమన్నారు,ప్రజల ఆరోగ్యమే మా ప్రథమ ప్రాధాన్యత. ఇలాంటి శిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ఆరోగ్య సమస్యలపై మేం మరింత దృష్టి పెట్టగలుగుతున్నాం," అన్నారు. అనేక మంది వైద్యులు, నర్సులు, సాంకేతిక నిపుణులు తమ సేవలు అందించగా, వందలాది మంది గ్రామస్తులు వివిధ వైద్య పరీక్షలు చేయించుకొని, ఉచిత మందులు కూడా అందుకున్నారు. ఏజెన్సీ వాసులకు ఆరోగ్య సేవలు అందించడమే నిజమైన ప్రజాసేవ అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న రోషన్ కుమార్



జంగారెడ్డిగూడెం -డివిజన్ ఇన్చార్జ్ -జూలై 20 (శుభోదయం న్యూస్): చింతలపూడి పట్టణం వెలమ పేటలోని పురవీధుల్లో ఇంటింటికి తిరుగుతూ సుపరిపాలన తొలి అడుగు



కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి వెళుతూ ఆ కుటుంబ సభ్యులను పేరుపేరునా పలకరిస్తూ,ప్రభుత్వ అందించే పథకాలు గురించి,ప్రభుత్వం చేస్తున్న,చేయబోతున్న కార్యక్రమాల గురించి సవివరంగా వివరిస్తూ, ప్రజలతో మాట్లాడుతూ ముందుకు అడుగు వేస్తున్న శాసనసభ్యులు, డి టు డీ ప్రచార కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్ళినప్పుడు కలిసిన ప్రజలతో మాట్లాడుతున్నప్పుడు కూటమి ప్రభుత్వ పరిపాలన చాలా బాగుందని, తల్లికి వందనం పథకం ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి పిల్లలకు పడిందని, గ్యాస్ బండకు సంబంధించిన డబ్బులు ఎకౌంట్లో పడుతున్నాయని వారి సంతోషాన్ని తెలియపరుస్తూ,, రోడ్ల వ్యవస్థ పైన, డ్రైనేజీ వ్యవస్థ పైన కాస్త దృష్టి సారించాలని శాసనసభ్యులకు ప్రజలు తెలియజేశారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టి సారించిందని అతి త్వరలో గుంతలు లేని రోడ్లు, మంచి డ్రైనేజీ వ్యవస్థ మీరు చూస్తారని చెప్పి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి పట్టణ, మండల నాయకులు కార్యకర్తలు, అభిమానులు చురుకుగా పాల్గొన్నారు.

# మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయమును ప్రారంభించిన.....

### చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్




జంగారెడ్డిగూడెం -డివిజన్ ఇన్చార్జ్- జూలై 20 (శుభోదయం న్యూస్): చింతలపూడిలో ఫైర్ స్టేషన్ సెంటర్ నందు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించిన శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ మానవత వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్ రామచంద్రారెడ్డి గారి ఆలోచన ఈరోజు ఇన్ని శాఖలుగా అభివృద్ధి చెంది ఎంతోమంది ప్రజలకు ఉపయోగపడుతున్నది, ఆయన యొక్క లక్ష్యం పదిమంది కార్చే కన్నీటిబట్టుల్లో కనీసం ఒక బొట్టు నైన



తుడవగలిగితే దానికి మించిన ఆనందం లేదనేది చాలా గొప్ప లక్ష్యం అని కొనియాడారు, ఈ కార్యక్రమంలో నన్ను కూడా మానవత కుటుంబ సభ్యుడిగా చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు అని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మానవత వ్యవస్థాపక అధ్యక్షులు ఏన్ రామచంద్ర రెడ్డి, జిల్లా కేంద్ర కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు,జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కరరావు,సభ్యులు పట్టణ నాయకులు, కార్యకర్తలు మానవత స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా మారెళ్ళ కాశీ రత్తమ్మ తృతీయ వర్ధంతి- పలువురు నివాళులు' అన్నదానం




ఒంగోలు, (శుభోదయం న్యూస్): ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయం నందు కాశీ రత్తమ్మ చిత్రపటానికి పూలమాలవేసి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించడం జరిగినది. ఈ సందర్భంగా మారెళ్ళ వివేకానంద మాట్లాడుతూ.. మా తల్లిగారు మారెళ్ళ కాశీ రత్తమ్మను స్మరించుకుంటూ ఈరోజు శివం శరణాలయంలో వృద్ధులకు మూడు పూటలా మాంసాహారంతో కూడిన భోజనం ఏర్పాటుతో పాటు వృద్ధులకు నూతన వస్త్రాలు పండ్లు కాయలు పంపిణీ చేశామని చెప్పారు. మీ కుటుంబాల్లో ముఖ్యమైన రోజుల్లో ఆడంబరాలకు పోకుండా ఇలాసేవా కార్యక్రమాల ద్వారా ఆకలి గొన్నవారికి పట్టెడన్నం పెట్టి వారి కళ్ళల్లో ఆనందం చూడటం ఎనలేని సంతోషాన్ని ఇస్తుందన్నారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి శివం శరణాలు స్థాపించి వృద్ధులకు ఆశ్రయం కల్పించి నగరంలో ప్రతిరోజు అనాథలకు అన్నదానం ఏర్పాటు చేయడం మానవత్వంతో కూడుకున్న మంచిపని వారికి ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు.




ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళ అభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు టీ. అరుణ మాట్లాడుతూ మారెళ్ళ వెంకటేశ్వర్లు-కాశీరత్తమ్మ కుటుంబం మానవత్వంతో పేదలకు సహకారం అందించే వారని వారి కుటుంబంలో ముఖ్యమైన రోజుల్లో సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకొని పేదలకు ఆర్థికంగా అండగా ఉండి పదిమందికి ఆదర్శంగా మారెళ్ళ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలో 300 మంది అనాథలకు యాచకులకు పౌష్టిక ఆహారంతో కూడిన భోజనం మారెళ్ళ కాశీరత్తమ్మ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ సేవ కార్యక్రమంలో మారెళ్ళ కాశీరత్తమ్మ కుటుంబ సభ్యులు పేల ప్రోలు రామకృష్ణ పరమహంస (బిర్లా) బ్రహ్మానందం మారెళ్ళ సుబ్బారావులతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ యక్కల తులసిరావు, దామచర్ల పూర్ణచంద్రరావు, అయ్యన్న, రావుల పద్మ సినీ నటులు దన్నారపు మస్తాన్రావు పాల్గొన్నారు.

### నూతన పి.ఏ.సి.ఎస్ చైర్ పర్సన్ లకు

# శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలి









గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) :బాపులపాడు మండల పరిధిలో, తెలుగుదేశం పార్టీ తరపున ఇటీవల నూతన పి.ఏ.సి.ఎస్ చైర్మన్ లుగా నియమితులైన వారికి ఈరోజు ఉదయం బాపులపాడు మండలం, వేలేరు గ్రామంలో ఉమ్మడి ప్రమాణస్వీకార మహోత్సవ సభను రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు గారు, కె.డి.సి.సి బ్యాంకు సి.ఈ.ఓ శ్యామ్ మనోహర్, హనుమాన్ జంక్షన్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ రావు హాజరయ్యారు. బాపులపాడు మండలం, వేలేరు గ్రామ చెన్న కేశవ విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా అవిర్నేని భవాని శంకర్, పాలకవర్గ సభ్యులుగా వీరవల్లి రంగారావు, తిరువీధి మరియదాసు, వీరితో పాటుగా కే.డి.సి.సి బ్యాంకు హనుమాన్ జంక్షన్ బ్రాంచి పరిధిలో గల వివిధ గ్రామాల సహకార సంఘాల అధ్యక్షులు బేత సుజాత - ఆరుగొలను, దన్నే దుర్గారావు - కానుమోలు, కొల్లి వెంకట లక్ష్మీనారాయణ - కొయ్యూరు, షాన్ బాషా - మల్లవల్లి, పిడికిటి రాంబాబు - మడిచర్ల, కనకవల్లి శేషగిరిరావు - రంగన్నగూడెం, కలపాల వెంకట శివప్రసాద్ - వీరవల్లి మరియు డైరెక్టర్లు అందరిచేత వేలేరు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరవ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు గారు ప్రమాణస్వీకారం చేయించి వారికి పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు గారు మాట్లాడుతూ కృష్ణా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ను దేశంలోనే మొట్ట మొదటి స్థానంలోకి తీసుకెళ్ళానని, అప్పుడు ప్రవేశ పెట్టిన పథకాలన్నీ కూడా రైతు నేస్తం, కర్షక మిత్ర లోన్లు, విజయ లోన్లు మరిన్ని ఇంతకు మునుపు ఇవ్వటం జరిగిందని మరియు రైతులు సహకరించటం వలన కూడా బ్యాంకు మరింత అభివృద్ధి చెందటం జరిగిందని తెలిపారు. అదే విధంగా సొసైటీలు కూడా అభివృద్ధి చెందాలంటే ఇప్పటి నుండే వాటికి అవగాహన కల్పిస్తూ ఏ ఏ లోన్లు రైతులకు అవసరానికి అందచేయాలి, రికవరీ శాతం ఎలా పెంచుకోవాలి అనే అంశాల మీద గౌరవ శాసన సభ్యులు వారు వర్క్ షాపును ఏర్పాటు చెయ్యమని సి.ఈ.ఓ గారికి మరియు జనరల్ మేనేజర్ గారిని కోరడం జరిగింది. గన్నవరం నియోజకవర్గం పరిధిలో ఉన్నటువంటి అన్ని సొసైటీలు, బ్రాంచిల పరిధిలో ఈ వర్క్ షాపును ఏర్పాటు చెయ్యమని కోరారు. అట్లాగే రైతులకు సకాలంలో లోన్లు, ఎరువులు, రుణాలు మరిన్ని ఇచ్చి సొసైటీలను మరింత ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లటం కోసం ఎప్పుడూ కృషి చేస్తానని అందరికీ అందుబాటులో ఉంటానని, ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని వారు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, రాష్ట్ర తెలుగుమహిళా కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, మండల పార్టీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పట్టా సురేష్, వేలేరు గ్రామ పార్టీ అధ్యక్షులు కాజా సురేష్ , కార్యదర్శి అంగడాల సీతారామస్వామి, డి.సి.యు.యు వాటర్ యూజర్ అసోసియేషన్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, వాటర్ యూజర్ అధ్యక్షులు, గ్రామ సర్పంచులు, వివిధ గ్రామాల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, కూటమి ప్రభుత్వం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనటం జరిగింది.

## సెక్యూరిటీ గార్డ్స్ సమస్యను పరిష్కరించిన మంత్రి ఫరూక్




నంద్యాల రిపోర్టర్ / మోహన్ (శుభోదయం న్యూస్): నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్స్ గా పని చేస్తున్న వారి సమస్యను పరిష్కరించినందుకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ కి వారి కార్యాలయం నందు కృతజ్ఞతలు తెలియజేసిన ప్రభుత్వ ఆసుపత్రి సెక్యూరిటీ గార్డ్స్. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఎవరి మధ్య భేదాభిప్రాయం లేకుండా అందరూ సక్రమంగా పనిచేసుకోవాలని ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకొని రావాలని తెలియజేశారు.

## లేపాక్షిలో ఘనంగా పద్యనాటక ఏకపాత్ర అభినయ పోటీలు




లేపాక్షి, మండల రిపోర్టర్ - అమరేష్ (శుభోదయం న్యూస్) : మండల కేంద్రం లోని జె.హెచ్ ఫంక్షన్ హాల్ ) నందు తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్టు (కళాభిషేకం) ఆధ్వర్యంలో ఆంధ్ర,తెలంగాణ,కర్ణాటక రాష్ట్రాల కళాకారులచే ఏక పాత్ర అభినయ పోటీలను నిర్వహిస్తున్నట్టు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.అంజనప్ప, డైరెక్టర్ పెద్దరికం సాయి ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నేటి ఆధునిక సమాజంలో తెలుగు సాంప్రదాయ కళారూపాలు నానాటికి కనుమరుగవుతున్న నేపథ్యంలో తేనె తెలుగు కల్చరల్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా మారు మూల ప్రాంతాలలో అనామకంగా ఉన్న మట్టిలో మాణిక్యాలాంటి కళాకారులను గుర్తించి గౌరవిస్తూ. వారి ప్రతిభను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కళాకారులచే ఈ కార్యక్రమం ఎంతో చారిత్రాత్మక స్థలం అయిన లేపాక్షిలో పద్యనాటక ఏకపాత్ర అభినయ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

## అద్దె ఇంట్లో ఐదు మృతదేహాలు..! ముగ్గురు చిన్నారులు సహా విగత జీవులుగా మారిన దంపతులు



ఓ అద్దె ఇంట్లో ఐదు మృతదేహాలను పోలీసులు గుర్తించారు. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు విషం తాడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ విషాద ఘటన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని బావ్లా తాలూకాలో చోటు చేసుకుంది. శనివారం (జూలై 19) రాత్రి వీరంత విషయం సేవించి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం ఎవరు బయటికి రాకపోవడం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు వచ్చే చూసే సరికి ముగ్గురు చిన్నారలతో సహా దంపతులు విగత జీవులుగా పడి ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతులను విపుల్ కాంజీ వాఘేలా (34), అతని భార్య సోనాల్ (26), వారి ముగ్గురు పిల్లలు 11, 5 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు కుమార్తెలు, 8 సంవత్సరాల కుమారుడుగా గుర్తించారు. వీరి స్వస్థలం గుజరాత్‌లోని సమీప పట్టణమైన ధోల్కాగా పోలీసులు గుర్తించారు. విపుల్ కంజీభాయ్ వాఘేలా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోనాల్ విపుల్భాయ్ వాఘేలా గృహిణి. కరీనా అలియాస్ సిమ్రాన్ విపుల్భాయ్ వాఘేలా, మయూర్ విపుల్భాయ్ వాఘేలా, యువరాజు విపుల్‌భాయ్ వాఘేలా చదువుకుంటున్నారు. ఈ కుటుంబం మొదట ధోల్కాలోని బార్కోతలోని దేవిపూజక్ వాస్ ప్రాంతానికి చెందినది , కొంతకాలంగా బాగోద్రలో నివసిస్తున్నారు. విపుల్ వాఘేలా తన కుటుంబాన్ని పోషించడానికి ఆటో రిక్షా నడుపుతూ జీవనోపాధి పొందేవాడు. విషం తాగి కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే, సామూహిక ఆత్మహత్య వెనుక గల కారణం ఇంకా తెలియరాలేదు. ఇప్పటివరకు ఎటువంటి సూసైడ్ నోట్ లభించలేదు. కానీ, ఆర్థిక ఒత్తిడి కారణంగానే కుటుంబ మొత్తం ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. పిల్లలకు విషం ఇచ్చి తర్వాత దంపతులు విషం తాగినట్లు భావిస్తున్నారు.

## డీకేపై సిద్దరామయ్య సంచలన కామెంట్స్. కర్నాటక రాజకీయాల్లో కొనసాగుతున్న హైడ్రామా





కర్నాటక రాజకీయాలు రసవత్తరంగా మారాయి. సీఎం సిద్ధరామయ్య , డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య ఆదిపత్య పోరు తారా స్థాయికి చేరింది. ఐదేండ్ల వరకు గద్దె దిగేది లేదంటూ సీఎం సిద్ద రామయ్య భిష్మించుకోగా, ఒప్పందం ప్రకారం సీఎం సీటు తనకు అప్పగించాల్సిందేనంటూ డీకే పట్టుపడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటక కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలిపోయింది. పార్టీ ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా చీలిపోయి బహిరంగంగానే విమర్శలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో హైకమాండ్ సైతం వార్నింగ్ ఇచ్చినా లాభం లేకుండా పోయింది. తాజాగా మైసూరులో జరిగిన ఓ సభలో సిద్దరామయ్య చేసిన కామెంట్స్ డీకే వర్గంలో మంటలు రాజేసింది. తన ప్రసంగంలో డిప్యూటీ డికె శివకుమార్ పేరును ప్రస్తావించడం పట్ల తన అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలను హైలైట్ చేయడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో, స్వాగత ప్రసంగం సమయంలో డిప్యూటీ ముఖ్యమంత్రి శివకుమార్ పేరును ప్రస్తావించడాన్ని గుర్తు చేసినందుకు సిద్ధరామయ్య బహిరంగంగా కాంగ్రెస్ నాయకుడిని విమర్శించారు. స్పష్టంగా చిరాకుగా ఉన్న సిద్ధరామయ్య ప్రసంగాన్ని మధ్యలో ఆపి, “డికె శివకుమార్ వేదికపై కాదు, బెంగళూరులో ఉన్నారు. ఇక్కడ ఉన్నవారిని మాత్రమే మేము స్వాగతిస్తాము. ఇంట్లో కూర్చున్న వారికి మేము శుభాకాంక్షలు తెలియజేయలేము” అని అన్నారు. ఈ వ్యాఖ్య కాంగ్రెస్ నాయకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. శివకుమార్‌కు దగ్గరగా ఉన్న ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముఖ్యమంత్రి స్వరంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. “డికె శివకుమార్ లేకుండా, కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చేది కాదు. ముఖ్యమంత్రి చేయగలిగేది కనీసం ఆయనను గుర్తించడం, ముఖ్యంగా పార్టీ కార్యకర్త వేదికపై ఆయనను గుర్తు చేసినప్పుడు. ఆయన అంత దురుసుగా స్పందించాల్సిన అవసరం లేదు” అని ఆ నాయకుడు తెలిపారు. కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కొంత కాలంగా ఊహాగానాలు చెలరేగుతున్నాయి, సిద్ధరామయ్య మద్దతుదారులు ముఖ్యమంత్రిగా ఐదేళ్ల పాటు పూర్తి కాలం పనిచేస్తారని చెబుతున్నారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీలోని శివకుమార్ మద్దతుదారులు “సరైన సమయం” వచ్చినప్పుడు ఉప ముఖ్యమంత్రి అత్యున్నత పదవిని చేపడతారని చెబుతున్నారు.

## వరుసగా మూడు రోజుల పాటు పోస్టాఫీసులు బంద్! ఎందుకంటే..?

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని పలు పోస్టాఫీసులు మూడు రోజులపాటు తాత్కాలికంగా




మూతపడనున్నాయి. డిజిటల్ ఎక్సలెన్స్‌లో భాగంగా నెక్స్ట్ జనరేషన్ ఏపీటీ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తపాలా శాఖ ప్రకటించింది. ఇందులో భాగంగా తిరుపతి డివిజన్ లోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 22న అప్ గ్రేడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ అధునాతన డిజిటల్ ప్లాట్ఫామ్‌కు అవాంతరాలు లేకుండా సురక్షితంగా మారడానికి వీలుగా జూలై 19 నుండి 21 వరకు ప్రణాళికాబద్ధమైన డౌన్‌టైమ్ అమలు చేస్తున్నారు. దీంతో ఆయా రోజుల్లో పోస్టాఫీసులలో ఎటువంటి ప్రజా లావాదేవీలు జరగవని పోస్టాఫీసుల సీనియర్ సూపరింటెండెంట్ మేజర్ సయిదా తన్వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. డేటా మైగ్రేషన్, సిస్టమ్ ధృవీకరణలు, కాన్ఫిగరేషన్ ప్రక్రియలను సులభతరం చేయడానికి, కొత్త సిస్టమ్ సజావుగా, సమర్థవంతంగా లైవ్ లోకి వెళ్లేలా చూసుకోవడానికి సేవల తాత్కాలిక నిలిపివేత అవసరమని వివరించారు. మెరుగైన వినియోగదారు అనుభవం, వేగవంతమైన సర్వీస్ డెలివరీ, మరింత కస్టమర్ ఫ్రెండ్లీ ఇంటర్ఫేస్‌ను అందించడానికి ఏపీటీ అప్లికేషన్‌ను రూపొందించారు. నెక్స్ట్ జనరేషన్ ఏపీటీ అప్లికేషన్ అమలులో భాగంగా జూలై 21న తెలంగాణలోని రంగారెడ్డి, నల్లగొండ, యాదాద్రి-భువనగిరి జిల్లాలు మినహా అన్ని పోస్టాఫీసుల్లో ఎలాంటి లావాదేవీలు జరగవని అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (టెక్-ఆపరేషన్స్) నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## అయ్యో దేవుడా.. తిరుమల క్యూలైన్‌లో ఉండగా గుండెపోటు.. హాస్పిటల్‌కు తరలించగా..



తిరుపతిలో తీవ్ర విషాదం వెలుగు చూసింది. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చి గుండె పోటుకుగురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భక్తుడు శనివారం ప్రాణాలు కోల్పోయాడు. కర్ణాటక రాష్ట్రం మాలూరుకు చెందిన వేణుగోపాల్(45) అనే భక్తుడు శ్రీవారి దర్శనం కోసం ఈ నెల 17 తిరుపతికి ఒంటరిగా వచ్చాడు. ఇక శ్రీవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో నిల్చున్నాడు. అతను నారాయణ గార్డెన్స్ వద్దకు రాగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించింది భక్తులు టీటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. భక్తుల సమాచారంతో వెంటనే అక్కడికి చేరుకున్న టిటిడి సిబ్బంది.. వెణుగోపాల్‌ను అంబులెన్స్ సహాయంతో వెంటనే స్థానిక అశ్విని హాస్పిట్‌లకు తరలించారు. అక్కడ వేణుగోపాల్‌ను పరీక్షించిన వైద్యులు అతని హార్ట్ స్ట్రోక్ వచ్చినట్టు నిర్ధారించారు. దీంలో అతనికి వెంటనే చికిత్సను అందించారు. అ తర్వాత మెరువైన చికిత్స కోసం అతన్ని స్విమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే గత రెండ్రోజులుగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వేణుగోపాల్ శనివారం ప్రాణాలు కోల్పోయాడు. దీంతో హాస్పిటల్ సిబ్బంది తిరుపతి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి. మృతుడి వివరాలను తెలుసుకున్నారు. దీంతో కర్ణాటక పోలీసుల సహాయంలో మృతదేహాన్ని వేణుగోపాల్ బంధువులకు అప్పగించే పనిలో ఉన్నారు తిరుపతి టూటౌన్ పోలీసులు.

# కొత్తగా చేరే పార్టీ, గోషామహల్ బై పోల్ పై తేల్చేసిన రాజాసింగ్..!!



బీజేపీకి రాజీనామా చేసిన రాజాసింగ్ అడుగులు ఎటు. రాజాసింగ్ రాజీనామాను బీజేపీ ఆమోదిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో, బీజేపీ సింబల్ పైన ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ పై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్ కు లేఖ రాసేందుకు పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, ఇదే సమయంలో రాజాసింగ్ శివసేనలో చేరుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. వీటి పైన రాజాసింగ్ స్పష్టత ఇచ్చారు. కొత్తగా చేరే పార్టీతో పాటుగా గోషామహల్ కు ఉప ఎన్నిక అంశం పైన రాజాసింగ్ తేల్చి చెప్పారు. బీజేపీ నుంచి బయటకు వచ్చిన రాజాసింగ్ రాజకీయ భవిష్యత్ ఏంటి. గోషామహల్ బాధ్యతలను రాజాసింగ్ స్థానంలో మాధవీలత కు ఇస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ సమయంలో రాజాసింగ్ స్పష్టత ఇచ్చారు. తాను ఏ పార్టీలో చేరే అంశం పైన ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తన ఎమ్మెల్యే పదవి పైన బీజేపీ నాయకత్వానిదే తుది నిర్ణయమని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమని బీజేపీ సూచిస్తే.. తాను సిద్దంగా ఉన్నానని స్పష్టం చేసారు. తాను చివరి శ్వాస వరకు హిందూత్వం కోసం పోరాటం చేస్తానని తేల్చి చెప్పారు. బీజేపీ అధినాయకత్వం పైన తనకు ఎలాంటి వ్యతిరేక భావం లేదని చెప్పుకొచ్చారు.

### నేడు సెలవు పై ప్రభుత్వం కీలక నిర్ణయం..!!

ఇక, సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో రాజాసింగ్ అమ్మవారిని దర్శించు కొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ బోనాల శుభాకాంక్ష లు తెలిపారు. వేలాదిమంది సింహవాహిని అమ్మవారి దర్శనం కోసం వస్తున్నారని చెప్పుకొచ్చారు. యావత్ భారతదేశంలో ఉండే హిందువుల అందరిపై సింహవాహిని అమ్మవారి ఆశీస్సులు ఉండా లని కోరుకున్నానని అన్నారు. దర్శనం అనంతరం ఓ మంత్రి తనతో మాట్లాడారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా అందరి లక్ష్యం ఒకటేనని, మోడల్ గోశాల కట్టడానికి తన సహకారం కావాలని ఆ మంత్రి తనను కోరారని చెప్పుకొచ్చారు. సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని వైభవం గా కడతామని గత ప్రభుత్వాలు గుడిపై రాజకీయం చేశారని విమర్శించారు ఎమ్మెల్యే రాజాసింగ్.

## వర్షాకాలంలో తినకూడని ఐదు కూరగాయలు ఇవే!



ఆరోగ్యానికి మించిన సంపద లేదంటారు. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. కానీ మారుతున్న జీవనశైలి, తీసుకుంటున్న ఆహారం కారణంగా చాలా మంది అనేక రోగాల బారిన పడుతున్నారు. ఇక వర్షాకాలం వలస్తే చాలు వ్యాధులు స్వైర విహారం చేస్తుంటాయి. కలుషితమైన నీరు , ఆహారం వలన అనేక రకాల ఇన్ఫెక్షన్స్ వస్తుంటాయి. అందుకే ఈ సీజన్‌లో తీసుకునే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతుంటారు. ముఖ్యంగా కొన్ని రకాల కూరగాయలను అస్సలే వండుకోకూడదంట. అవి ఏవో ఇప్పుడు చూద్దాం. ఆకుకూరలు : ఆకుకూరలు ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ వర్షాకాలంలో మాత్రం అవి అంత సురక్షితమైనవి కావు అని చెబుతుంటారు. ఎందుకంటే ఇవి భూమికి దగ్గరగా పెరుగుతుంటాయి. అయితే వర్షాల సమయంలో వరదల సమయంలో ఆకుకూరలు నీటిలో మునిగిపోతాయి. దీని వలన బ్యాక్టీరియా, సంతానోత్పత్తికి ఆకుకూరల మొక్కలు నివాసంగా ఏర్పడుతాయి. అందుకే వీటిని తినకూడదని చెబుతుంటారు. ఒక వేళ అలాంటి ఆకు కూరలు తినడం వలన కడుపు ఇన్ఫెక్షన్స్, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు వస్తాయంట. కాలీఫ్లవర్ :కాలీఫ్లవర్ అంటే చాలా మందికి ఇష్టం ఉంటుంది. అయితే దీనిని వర్షాకాలంలో అస్సలే తినకూడదంట. ఎందుకంటే? ఈ సీజన్‌లో కీటకాలు, పురుగులకు ఇది ఆవాసంగా ఉంటుందంట. దీనివలన జీర్ణసమస్యలు వస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. క్యాబేజీ : క్యాబేజీ కర్రీతో ఏ వంటకం అయినా సులభంగా చేసుకోవచ్చు. అయితే దీనితో పకోడి లేదా సైడ్ డిష్ క్యాబేజీ ఫ్రైస్ చేసుకొని చాలా మంది ఇష్టంగా తింటుంటారు. కానీ ఇలా అస్సలే తినకూడదంట. ఎందుకంటే క్యాబేజిలో తేమ ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా ఇది భూమికి దగ్గరగా ఉంటుంది. కాబట్టి వర్షాకాలంలో దీనిని తినడం వలన అనేక ఇబ్బందులు తలెత్తుతాయంట. పుట్టగొడుగులు : అధిక తేమ కలిగిన ఆహారాల్లో పుట్ట గొడుగులు ఒకటి. వీటిలో ఫంగల్ ఇన్ఫెక్షన్స్ అనేది సాధారణం అందువలన వర్షాకాలంలో వీటిని ఎక్కువగా తినకూడదంట. దీని వలన ఫుడ్ పాయిజనింగ్, అలెర్జీ వంటి సమస్యలు వస్తాయంట. ఒక వేళ వండుకుంటే కొనుగోలు చేసిన వెంటనే వాటిని ఉడకబెట్టాలంట. అంతే కాకుండా ఈ సీజన్‌లో క్యాప్సికమ్ కూడా తినడం మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు

## కొండ చిలువ చెట్టు ఎక్కే విధానం ఎప్పుడైనా చూశారా?



ఏదైనా వీడియో ట్రెండింగ్ కావాలంటే అది సోషల్ మీడియానే అని చెప్పక తప్పదు. ప్రతి రోజు ఎన్నో వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా పాములు, జంతువులు ఎక్కువగా వైరల్ అవుతుంటాయి. టెక్నాలజీ పెరిగిన తర్వాత ప్రపంచం మొత్తం సోషల్ మీడియాలోనే కనిపిస్తుంది. చిన్న విషయాన్ని కూడా సోషల్ మీడియాలో హైలెట్ అవుతున్నాయి. ఇక వైరల్ వీడియోలకు కొదవే లేదు. ప్రపంచంలో ఎక్కడ ఎలాంటి వింత విచిత్రం కనిపించిన అది సోషల్ మీడియాలో దర్శమిచేస్తుంది. అయితే ఇక్కడ ఓ పాము చెట్టు ఎక్కడం తెగ వైరల్ అవుతోంది. నిత్యం మనం నెట్టింట్లో పాముల వీడియోలు చాలానే చూస్తుంటాం.. రకరకాల పాములు సోషల్ మీడియా ద్వారా చూస్తుంటాం.. అన్నింటికన్నా పెద్దది భయంకరమైనది కొండచిలువే అని అందరికి తెలిసిందే. పెద్ద పెద్ద జంతువులను సైతం సులభంగా తినెయగల సత్తా ఉంటుంది. అయితే కొండచిలువ ఒక జంతువుని గానీ, మనిషిని గానీ తిన్నట్లయితే దాన్ని అరిగించుకునేందుకు చెట్టుకు చుట్టుకుని అరిగించుకుంటుందని చెబుతుంటారు. అయితే ఇక్కడ కొండచిలువ ఎవ్వరిని తినలేదు కానీ చెట్టెక్కుతూ కనిపించింది. ఈ పాము చెట్టును చుట్టుకుంటూ ఎలా ఎక్కుతుందో చూస్తే ఆశ్చర్యపోతారు. ఈ చెట్టు ఎక్కుతున్న పాము వీడియో నెట్టింట హల్ చల్ చేస్తుంది. మాములుగా పాములు ముందుకు సాగుతూ చెట్లను ఎక్కుతాయి. అయితే కొండచిలువ మాత్రం చెట్టును చుట్టుకుంటు ఎక్కుతుంది. ఈ వీడియో చూడటానికి భయమేసినా ఆ పాము చెట్టు ఎక్కినా తీరు నెటిజన్లను ఆకట్టుకుంటుంది. కొండచిలువలు చెట్టు ఎక్కే సామర్థ్యానికి ప్రసిద్ధి చెందాయి. అవి కండరాల బలం, కన్సర్టినా లాంటి కదలికల కలయికను ఉపయోగించి పైకి ఎగురుతాయి. అవి తమ బలమైన కండరాలు, పొలుసులతో చెట్టును పట్టుకుంటాయి తరువాత పైకి కదలడానికి నెట్టివేస్తాయి. ఎక్కడానికి ఈ ప్రక్రియను పునరావృతం చేస్తాయి. కొండచిలువలు బలమైన కండరాలు, పొలుసులను కలిగి ఉండటం వల్ల నిలువు ఉపరితలాలను ఎక్కడానికి అవసరమైన పట్టు ఉంటుంది.

## శాఖ లే నిబంధనలను నీరుగారిస్తున్నాయా.? గోలి సోడా తయారీ కేంద్రంలో నిబంధనలకు తూట్లు.. తూతూ మంత్రంగా స్పందిస్తూ..చోద్యం చూస్తున్న అధికారులు.




)స్థానిక గుత్తి రోడ్ తడకలేరు సమీపంలో గోలి సోడా తయారీ కేంద్రంలో ఆయా శాఖల నిబంధనలకు తూట్లు అనే కథనానికి సివిల్ సప్లై అధికారులు తూతూ మంత్రంగా స్పందించారు. సదరు తయారీ కేంద్రంలో పోలీసోడా తయారీకి వాడే కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను వాడకుండా, సాధారణ సిలిండర్లను వాడుతున్న వాటిని ‘ పత్రిక ‘ ఫోటో ఆధారాలతో కథనాన్ని ప్రచురించింది. వాటికి బుక్కరాయసముద్రం సీఎస్డీటీ రెండు రోజుల తర్వాత వెళ్లి పరిశీలించి షో కాజ్ నోటీసుకు పరిమితం చేశారు. అదే క్రమంలో ప్రధానంగా అగ్నిమాపక శాఖ అనుమతులు, నిబంధనలను గోలి సోడా తయారీ కేంద్రం వారు పాడేకట్టారు. ఈ నేపథ్యంలోనే సంబంధిత ఆయా శాఖల నిబంధనలను సైతం లెక్కచేయకుండా వారి అధిక ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. వీటి పై ఆయా శాఖల వారు నిబంధనల ఉల్లంఘనల పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.



## బాబు సూరిటీ-మోసం గ్యారంటీ చందర్లపాడు మండల విస్తృతస్థాయి సమావేశం



చందర్లపాడుగ్రామంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తల మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం లోకి వచ్చేందుకు అమలు సాధ్యంకానీ హామీలివటం అధికారం లోకి వచ్చిన తరువాత విస్మరించటం ముఖ్యమంత్రి చంద్రబాబు కు వెన్నెతో పెట్టిన విద్యని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలన్నారు. ముఖ్యంగా మండలం లోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజల పూర్తిగా మోసపోయారని




జగన్మోహన్ రావు తెలిపారు ఏడాది కాలంగా ప్రజలకు చేసిందేమీ లేకపోయినా సుపరిపాలన - తొలి అడుగు అంటూ ప్రజలను మరోసారి ఏ మార్చే యత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలను అదిగో చేస్తున్న ఇదిగో ఇస్తున్నామంటూ అసత్య ప్రచారాలు చేయటం తప్ప ఒక పథకాన్ని కూడా సమర్థవంతంగా అందించిన దాఖలాలు లేవని చెప్పారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తే కూటమి ప్రభుత్వ%శీ% మాత్రం ఇచ్చే అరకొర పథకాలను షారుతులు విధించి అనర్హులంటూ లబ్దిదారులను కుదిస్తుందని తెలిపారు. వారి మోసాలను ప్రజలు గమనిస్తున్నారని రానున్న కాలంలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ ఎంపీపీ, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చై న్యూ లుక్ ఫిషర్‌మేన్ ఏంటి ఇలా మారాడు



ఇంతకుముందు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్పరాజ్ గా కనిపించాక, తన పాత్రతో పని పూర్తయ్యాక కొత్త ఫోటోషూట్ లో ట్రెండీ లుక్ లో కనిపించాడు. తనలోని స్టైలిష్ స్టార్ ని మళ్లీ ఎలివేట్ చేసాడు. మొన్ననే కదా ఫిషర్‌మేన్ లా మాసీగా కనిపించాడు నాగచైతన్య.-తండేల్- సినిమాలో ఎంతో నేచురల్ గా మత్స్యకార కుటుంబంలోంచి వచ్చిన యువకుడిగా అద్భుతంగా అభినయించాడు. ఇప్పుడు ఇంతలోనే ఇలా మారాడేమిటి? దేనికోసం ఈ మార్పు? అంటే.. కచ్చితంగా ఇది తనలోని వైవిధ్యాన్ని ప్రదర్శించేందుకే. నిజానికి నాగచైతన్య క్లాస్ అప్పీల్ ఉన్న హీరో. అందువల్ల అతడు మాస్ లుక్ కి మారడానికి చాలా శ్రమించాడు. కానీ ట్రెంచ్ కోట్ లు, సెట్ పీస్ లు ధరించి మగువల గుండెల్లో మన్మధ బాణాలు గుచ్చే కుర్రాడిగా మారడానికి అతడు అంతగా శ్రమించనవసరం లేదు. ఏది ఏమైనా, ఇప్పుడు చై ఇస్మార్ట్ లుక్ లోకి మారాడు. టాలీవుడ్ లో స్టైలిష్ లుక్ ఉన్నక అరుదైన హీరోల్లో చైతూ ఒకడు అని ఈ కొత్త ఫోటోషూట్ నిరూపించింది. స్టైల్.. సింప్లిసిటీ.. వైవిధ్యం ఈ మూడూ అతడి ఫ్యాషన్ సెన్స్ లో కనిపిస్తున్నాయి. ప్రస్తుత యూత్ చాలా ట్రెండీ లుక్ లో కనిపిస్తున్నారు. వారందరినీ మెప్పించాలంటే, చైతూలోని వెర్సటైలిటీని ఫోటోషూట్లతోనే ఆవిష్కరించాలి. ఇప్పుడు అతడు మాస్ పాత్రలే కాదు.. క్లాస్ పాత్రలతోను దూసుకు రాగలడని మేకర్స్ కి పూర్తి క్లారిటీ వచ్చేసింది. ఇంతకుముందు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్పరాజ్ గా కనిపించాక, తన పాత్రతో పని పూర్తయ్యాక కొత్త ఫోటోషూట్ లో ట్రెండీ లుక్ లో కనిపించాడు. తనలోని స్టైలిష్ స్టార్ ని మళ్లీ ఎలివేట్ చేసాడు. అదే తీరుగా ఇప్పుడు తండేల్ రాజు పాత్ర నుంచి బయటకు వచ్చి ఇలా కొత్తగా కనిపించేందుకు నాగచైతన్య ప్రయత్నించడం ఆకర్షిస్తోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే చైతూ ప్రస్తుతం కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో తన 24వ చిత్రంలో నటిస్తున్నాడు.




# బికినీలో పాలక్ చిల్లింగ్ మోడ్



బుల్లితెర నటి శ్వేతా తివారీ కుమార్తె పాలక్ తివారీ పరిచయం అవసరం లేదు. ఈ భామ నిరంతర ఫోటోషూట్లు యువతరంలో వేడెక్కిస్తున్నాయి.బుల్లితెర నటి శ్వేతా తివారీ కుమార్తె పాలక్ తివారీ పరిచయం అవసరం లేదు. ఈ భామ నిరంతర ఫోటోషూట్లు యువతరంలో వేడెక్కిస్తున్నాయి. పాలక్ ప్రస్తుతం ఆదిపురుష్ నటుడు సైఫ్ అలీఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ తో డేటింగ్ చేస్తోందంటూ ప్రచారం సాగుతోంది. పాలక్- ఇబ్రహీం జంట ఔటింగులు జంట షికార్లకు సంబంధించిన పోటోలు వీడియోలు గతంలో వైరల్ అయ్యాయి. ఇదిలా ఉంటే, పాలక్ తివారీ ప్రస్తుతం తన మామ్ శ్వేతా తివారీతో కలిసి విహారయాత్రను ఆస్వాధిస్తోంది. ఈ విహార యాత్రలో తల్లీకూతుళ్ల బికినీ లుక్స్ ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. అందమైన మామ్- డాటర్ జోడీ బికినీలలో ఫోటోలను షేర్ చేసిన తర్వాత నెటిజనులు పిచ్చెక్కిపోతున్నారు. ఈ ఫోటోలలో శ్వేతా తివారీ బ్లాక్ అండ్ వైట్ పోల్కా డాట్ బికినీలో కనిపించగా, పాలక్ తివారీ రెడ్ అండ్ వైట్ బికినీలో కనిపించారు. ప్రస్తుతం ఇవి వైరల్ గా షేర్ అవుతున్నాయి. అందాల మామ్ అండ్



డాటర్ బోల్డ్ లుక్స్ అభిమానులను ఆశ్చర్యపరిచాయి. నెటిజనులు వీటిపై రకరకాల కామెంట్లు చేస్తున్నారు. ఈ ఫోటోలను షేర్ చేసిన పాలక్ తన పోస్ట్‌లోని వ్యాఖ్యల విభాగాన్ని నిలిపివేసింది. కాబట్టి యూత్ ప్రస్తుతం పాలక్ తల్లి శ్వేతా తివారీ వ్యాఖ్యల విభాగంలో మామ్ అందచందాలపై వ్యాఖ్యానిస్తున్నారు. సల్మాన్ -కిసీ కా భాయ్ కిసీ కి జాన్- చిత్రంతో తెరంగేట్రం చేసిన పాలక్ తివారీ కెరీర్ పరంగా ఆశించిన దూకుడును చూపించలేదు. దాదాపు రెండేళ్ల తర్వాత పాలక్ నటించిన హారర్ కామెడీ -ది భూత్నీ- విడుదలైంది. తదుపరి స్టార్ కిడ్స్ సరసన నటించేందుకు అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వరస చిత్రాలతో కెరీర్ పరంగా బిజీగా ఉన్న పాలక్ టాలీవుడ్ అగ్ర నిర్మాతలకు ఫీలర్స్ వదులుతోందని గుసగుసలు వినిపిస్తున్నాయి.



# 'తమ్ముడు'తో రెండు గంటల యాక్టింగ్..!






నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందిన 'తమ్ముడు' సినిమా విడుదలకు ముస్తాభయింది. నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందిన 'తమ్ముడు' సినిమా విడుదలకు ముస్తాభయింది. కొన్ని కారణాల వల్ల నెలల తరబడి ఆలస్యం అవుతూ వచ్చిన ఈ సినిమాను ఎట్టకేలకు జులై 4న ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు రెడీ అయ్యారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన దక్కింది. వేణు శ్రీరామ్ గత చిత్రాల ఫలితాల నేపథ్యంలో ఈ సినిమాకు పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. వకీల్ సాబ్ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని దర్శకుడు వేణు శ్రీరామ్ ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయ్యాడు. ఈ మధ్య కాలంలో వేణు శ్రీరామ్ చేసిన హడావిడి నేపథ్యంలో సినిమాకు మంచి పబ్లిసిటీ కూడా దక్కింది అనే విషయం తెల్సిందే. ఈ సినిమాతో సీనియర్ హీరోయిన్ లయ రీ ఎంట్రీకి సిద్ధం అయింది. హీరోయిన్‌గా ఎన్నో సినిమాల్లో నటించిన లయ పెళ్లి చేసుకుని పూర్తిగా అమెరికా షిఫ్ట్ అయింది. కుటుంబ బాధ్యతలు, పిల్లలు ఇతర కారణాల వల్ల సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చిన లయ ఎట్టకేలకు రీ ఎంట్రీకి సిద్ధం అయింది. ఆమె ఈ సినిమాలో నితిన్‌కి అక్క పాత్రలో కనిపించబోతుంది. తమ్ముడు అనే టైటిల్‌తోనే ఈ సినిమాలో లయ పాత్ర ఎంత పవర్ ఫుల్‌గా, ప్రాధాన్యతను కలిగి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. తమ్ముడు సినిమాలో కన్నడ ముద్దుగుమ్మ సప్తమి గౌడ నటించింది. కాంతార సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు దక్కించుకున్న ఈమె తమ్ముడు సినిమాలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. కాంతార సినిమా తర్వాత తెలుగు నుంచి ఈమెకు చాలా ఆఫర్లు వచ్చాయట. కొన్ని కారణాల వల్ల వాటిని సున్నితంగా తిరస్కరిస్తూ వచ్చిన సప్తమి ఎట్టకేలకు ఈ సినిమాలో నటించింది. ఈ సినిమాలో సప్తమి పాత్ర ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని ట్రైలర్‌ను చూస్తే అర్థం అవుతుంది. ఆమె పాత్ర, లుక్ చాలా విభిన్నంగా ఉన్నాయి. అయితే ఈ సినిమాలో హీరో నితిన్‌తో తన కాంబో సీన్స్ చాలా తక్కువగా ఉంటాయని ఒకటి రెండు సీన్స్‌కే పరిమితం కానున్నట్లు చెప్పుకొచ్చింది. నితిన్‌తో కలిసి ఈ సినిమా కోసం కేవలం రెండు గంటలు మాత్రమే షూటింగ్‌లో పాల్గొన్నట్లు సప్తమి తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. హీరోతో హీరోయిన్ కేవలం రెండు గంటల షూటింగ్ ఏంటా అని అంతా షాక్ అవుతున్నారు. ఆమె మాటలను బట్టి ఈ సినిమాలో హీరోయిన్‌గా కాకుండా సప్తమి ముఖ్య పాత్రలో కనిపించబోతుంది. నితిన్‌తో పాటలు, లవ్ ట్రాక్ ఉండదని తేలిపోయింది. ఈ సినిమాలో వర్ష బొల్లమ్మ హీరోయిన్‌గా నటించింది. ఆమెతో నితిన్ లవ్ ట్రాక్ ఉంటుందేమో చూడాలి. మొత్తానికి ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ ఉండటంతో పాటు కీలక పాత్రలో లయ నటించడంతో అంచనాలు భారీగా పెరిగాయి. ఈ సినిమాను దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మించాడు. సినిమా సమయం ఎక్కువ కావడంతో పాటు, కొన్ని కారణాల వల్ల బడ్జెట్ చాలా ఎక్కువ అయిందట. దాంతో హీరో, దర్శకుడు పారితోషికం త్యాగం చేశారని, విడుదలైన తర్వాత వారు తమ పారితోషికం తీసుకునేందుకు ఒప్పుకున్నారని తెలుస్తోంది. సినిమాపై నమ్మకంతో వారిద్దరూ పారితోషికంను సైతం త్యాగం చేసి మరీ సినిమా కోసం కష్టపడ్డారు. మరో ఆరు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న తమ్ముడు మెప్పిస్తాడా... సప్తమి గౌడకు టాలీవుడ్‌లో హిట్‌తో ఎంట్రీ దక్కేనా అనేది చూడాలి.

# చీరకట్టులో అందాల చి.ల.సౌ





నటిగా ప్రశంసలు అందుకుంది. విభిన్నమైన కంటెంట్ చిత్రాలను ఎంచుకుంటూ తనదైన ముద్రవేసింది. అందం, అభినయంతో కుర్రకారు హృదయాలను దోచేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు అదృష్టం మాత్రం కలిసిరావడం లేదు. ఇప్పుడు ఈ అమ్మడు సరైన బ్రెక్ కోసం వెయిట్ చేస్తుంది. తాజాగా చీరకట్టులో గ్లామర్ ఫోజులతో కుర్రాళ్లకు కునుకు లేకుండా చేస్తుంది. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో కొత్త హీరోయిన్స్ సత్తా చాటుతున్నారు. ఫస్ట్ మూవీతోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంటున్నారు. తక్కువ సమయంలోనే సినీరంగంలోకి తమదైన ముద్ర వేస్తున్నారు. కానీ కొందరు మాత్రం వరుసగా లు చేస్తున్నప్పటికీ సక్సెస్ కాలేకపోతున్నారు. అందులో ఈ ముద్దుగుమ్మ ఒకరు. అందంలో అప్సరస ఆమె.. తెలుగుతోపాటు తమిళంలోనూ వరుస ల్లో నటిస్తుంది. కానీ ఈ ముద్దుగుమ్మకు ఇప్పటికీ సరైన బ్రేక్ మాత్రం రాలేదు. ఇప్పటివరకు తెలుగులో ఎనిమిది ల్లో నటించింది. కానీ అందులో రెండు మాత్రమే బ్లాక్ బస్టర్ హిట్ అయ్యాయి. ఇంతకీ ఈ వయ్యారి ఎవరో తెలుసా.. ? తనే హీరోయిన్ రుహానీ శర్మ. కెరీర్ ప్రారంభంలోనే చిలసౌ వంటి విభిన్న కంటెంట్ తో జనాలకు దగ్గరయ్యింది. ఇందులో పద్ధతిగా ఢీగ్లామర్ లుక్ లో కనిపించి నటిగా ప్రశంసలు అందుకుంది. కానీ ఈ అంతగా హిట్ కాకపోవడంతో రుహానీ అంతగా క్రేజ్ రాలేదు. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు అందుకుంది. టాలీవుడ్ ఇండస్ట్రీలో అడపాదడపా చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తుంది. చిలసౌ తర్వాత డర్టీ హరి, నూటొక్క జిల్లాల అందగాడు, హర్ , సైంధవ్ వంటి చిత్రాల్లో నటించింది. అయితే ఈ లు బాక్సాఫీస్ వద్ద అంతగా మెప్పించలేదు. దీంతో రుహానీకి సైతం అంతగా పాపులారిటీ రాలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ నిత్యం ఏదోక పోస్ట్ చేస్తుంది. తాజాగా చీరకట్టులో మరింత గ్లామర్ ఫోజులతో ఫోటోస్ షేర్ చేసింది. ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు నెట్టింట ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది.

# నిర్లక్ష్యం-అణిచివేతపై నాని పోరాటం!



నేచురల్ స్టార్ నాని పుల్ స్వింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు. నేచురల్ స్టార్ నాని పుల్ స్వింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు. ఇటీవలే -హిట్-3-తో మరో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. దీంతో రెట్టించిన ఉత్సాహతో కొత్త సినిమా షూటింగ్ పూర్తి చేస్తున్నాడు. ఇప్పటికే -దసరా- తర్వాత మరోసారి శ్రీకాంత్ ఓదెలతో మరోసారి చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఇద్దరి కాంబినేషన్ లో -ది ప్యారడైజ్- ప్రారంభమవ్వడం, కొంత షూటింగ్ చేయడం తెలిసిందే.-హిట్ 3- సెట్స్ లో ఉండటంతో తాత్కాలికంగా బ్రేక్ వేశారు. రిలీజ్ అనంతరం మళ్లీ యధావిధిగా షూటిం గ్ పున ప్రారంభమైంది. తాజాగా ఇటీవలే మరో కొత్త షెడ్యూల్ మొదలైంది. ప్రస్తుతం ఓ భారీ సెట్ లో షూటింగ్ చేస్తున్నారు. ఇదే సెట్ లో 40 రోజుల పాటు షూటింగ్ జరుగుతుంది. గత వారం జరిగిన షెడ్యూల్ లో హీరో బాల్యానికి సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాకి సంబం ధించిన స్టోరీ లైన్ లీకైంది. ఇప్పటికే ఇది భారీ మాస్ చిత్రమని తెలిసింది. దసరా ని మించిన మాస్ కంటెంట్ గా వైరల్ అయింది. కానీ పాయింట్ ఏంటి? అన్నది రివీల్ కాలేదు. తాజాగా విషయం లీకైంది. సమాజంలో నిర్లక్ష్యానికి- అణిచి వేత కు గురైన ఓ తెగ కథ ఇది. ఇందులో నాని తన తెగ కోసం పోరాడే యోదుడి పాత్ర పోషిస్తున్నాడు. భిన్న మైన పాత్రలో నాని కనిపిచంనున్నాడు. గతంలో మునుపెన్నడు నాని పోషించిన రోల్ ఇది. -దసరా-ఓ జానర్ కథ అయితే ప్యారడైజ్ అందుకు భిన్నంగా మరింత శక్తివంతమైన కథగా తెలుస్తుంది. ఈ చిత్రాన్ని స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో కూడా రిలీజ్ చేస్తున్నారు. అంటే అక్కడ నేపథ్యానికి కూడా కనెక్ట్ అయ్యే అవకాశం ఉండటంతోనే ఈ ఛాన్స్ తీసుకుంటున్నారు. యూనివర్శల్ కాన్సెప్ట్ కావడంతో నిర్మా తలు ఎక్కడా రాజీ పడకుండా ముందుకెళ్తున్నారు. పాన్ ఇండియాలో భారీ ఎత్తున వచ్చే ఏడాది మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మొన్న రామ.. నిన్న కర్ణ.. నేడు రుద్ర



దీంతో ఇప్పుడు ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నెట్టింట తెగ సందడి చేసున్నారు ప్రభాస్ అభిమానులు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. అయితే జూన్ నెలతో డార్లింగ్ కు స్పెషల్ బాండ్ ఉన్నట్టు క్లియర్ గా కనిపిస్తుంది. ఆ మంత్ లో మూడేళ్లుగా తన సినిమాలతో థియేటర్ లో సందడి చేస్తున్నారు ప్రభాస్. 2023లో ఆది పురుష్ తో, 2024లో కల్కి 2898 ఏడీతో, 2025లో కన్నప్పతోవచ్చారు. అక్కడ ఇంకో విషయమేమిటంటే.. మూడు సినిమాలు కూడా మైథలాజికల్ జోనర్ లో వచ్చినవే. ప్రభాస్ పోషించిన రోల్స్.. పురాణ నేపథ్యంతో ఉండటం విశేషం. ఆదిపురుష్ రాముడిగా కనిపించిన ప్రభాస్.. కల్కి 2898 ఏడీలో కర్ణుడిగా సందడి చేశారు. ఇప్పుడు కన్నప్పలో రుద్ర క్యారెక్టర్ లో మెప్పించారు. క్యామియో రోల్ పోషించినా అదరగొట్టారు. దీంతో ఇప్పుడు ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నెట్టింట తెగ సందడి చేసున్నారు ప్రభాస్ అభిమానులు. మూడు రోల్స్ కు సంబంధించిన లుక్స్ ను వైరల్ చేస్తున్నారు. అయితే మూడు చిత్రాల్లో ఆది పురుష్ డిజాస్టర్ గా మారినా.. కల్కి 2898 ఏడీతో పాటు కన్నప్ప చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. కాగా ఆ సినిమాల విషయానికొస్తే.. ప్రభాస్ రాముడి రోల్ లో తెరకెక్కిన ఆదిపురుష్ కు బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్ దర్శకత్వం వహించారు. సీతగా కృతి సనన్, రావణుడిగా సైఫ్ అలీ ఖాన్ నటించిన ఆ సినిమా 2023 జూన్ 16వ తేదీన రిలీజైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన మూవీ.. బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా మారింది. ట్రోల్స్ కూడా ఎదుర్కొంది. ఆ తర్వాత గత ఏడాది జూన్ 27వ తేదీన కల్కి 2898 ఏడీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఆ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ తదితర ముఖ్య పాత్రలు పోషించారు. క్లైమాక్స్ లో కర్ణుడిగా ప్రభాస్ కనిపించి ఆకట్టుకున్నారు. సీక్వెల్ లో ఆయన రోల్ కీలకంగా ఉండనుందని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఇప్పుడు తాజాగా కన్నప్పలో రుద్ర క్యారెక్టర్ లో ప్రభాస్ ఆద్యంతం మెప్పించారు. భక్త కన్నప్ప చరిత్ర ఆధారంగా రూపొందిన ఆ సినిమాకు మెయిన్ పాజిటివ్ ఎలిమెంట్ గా నిలిచారు. ఆయన తప్ప ఎవరూ ఆ రోల్ కు సెట్ అవ్వరనేలా నటించారు. శుక్రవారం రిలీజ్ అయిన కన్నప్ప.. అన్ని సెంటర్స్ లో దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతోంది.